


హామీలు ఆరు..
ఇంకెంత కాలం సారూ!

సూపర్ సిక్స్ హామీలన్నీ వెంటనే అమలు చేయాలని ప్రజల డిమాండ్

అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పథకాల అమలులో జాప్యం చేస్తోంది. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం', ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, నిరుద్యోగ యువతకు ప్రతి నెలా రూ.3వేలు నిరుద్యోగ భృతి, రైతులకు ఏటా రూ.20వేల సాయం, ప్రతి మహిళకు నెలనెలా రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరిట ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు పథకాల ఊసే ఎత్తడం లేదు. వంద రోజుల పాలన పూర్తవుతున్నా అధ్యయనాల పేరిట కాలయాపన చేస్తుండటంతో చంద్రబాబు మరోసారి తమను మోసం చేశాడంటూ అన్ని వర్గాల ప్రజలు ఉసూరుమంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

ఎప్పుడిస్తారో చెప్పండి..



సూపర్‌సిక్స్ పేరిట చంద్రబాబు మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను చూసి ఆయనకు ఓటు వేశాం. ప్రతీ మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఆ డబ్బులు ఇస్తే ప్రతినెలా ఏదో ఒక అవసరం తీరుతుందన్న ఆశతో ఉన్నాం. ఇంతవరకూ ఆ పథకానికి సంబంధించిన విధివిధానాలు ఏవీ వివరించడం లేదు. నాతో పాటు నాకు తెలిసిన ప్రతి మహిళకూ తెలుగుదేశం పార్టీకు ఓటు వేయమని చెప్పాను. ఇప్పుడు రూ.1500 ఎప్పుడు ఇస్తారని నాకు అడుగుతున్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం హామీ నిలబెట్టుకోవాలి.

- ఎస్.కళ్యాణి, శ్రీకాకుళం

ఉచిత సిలిండర్లు ఎక్కడ శంకరా..!

కూటమి అధికారంలోకి రాగానే ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. 19 ఏళ్లు దాటిన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తాం. మహిళలు ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చు.

– మే 5న 'ఈనాడు' పత్రికలో ప్రచురితమైన శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ హామీలు



ఉచిత సిలిండర్లు ఎక్కడ?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తారని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవుతున్నా ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వలేదు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే భర్త లేని నాకు ఆర్థిక భారం తగ్గుతుందని అనుకున్నా. అయినా ఇంతవరకు గ్యాస్ ఊసే లేకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు.

– పి.విజయలక్ష్మి, శ్రీకాకుళం నగరం

మహిళా సాధికారత ఏదీ.. ఈశ్వరా!

మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా 19 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ నెలకు రూ.15 వందలు ఇస్తాం. సూపర్ సిక్స్ పథకాలు ప్రజల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి దోహదపడతాయి.

మే 4న ఈనాడు పత్రికలో ప్రచురితమైన ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు



నెలకు రూ.1500 ఎప్పుడిస్తారు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలనెలా రూ.1500 అందజేస్తామని సూపర్‌సిక్స్ పేరిట మేనిఫెస్టో ప్రకటించారు. ప్రతి ప్రచార సభలోనూ హడావుడి చేశారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తోంది. ఇంకా ఎన్ని రోజులు ఎదురుచూడాలో?

– శానుపల్లి భవానీ, లావేటిపేట గ్రామం, ఎచ్చెర్ల మండలం

మహిళకు నెలకు రూ.1500 సాయం


నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి
శ్రీకాకుళం	98,588	రూ.14.78 కోట్లు
ఎచ్చెర్ల	1,47,861	రూ.22.17 కోట్లు



అన్నదాతా సుఖీభవా

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి
శ్రీకాకుళం	24,342	రూ.48.68 కోట్లు
ఎచ్చెర్ల	41,926	రూ.83.85 కోట్లు





తల్లికి వందనం

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి
శ్రీకాకుళం	46,850	రూ.70.27 కోట్లు
ఎచ్చెర్ల	36,761	రూ.55.08 కోట్లు



నిరుద్యోగ భృతి

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)	పొందాల్సిన లబ్ధి
శ్రీకాకుళం	1,23,851	రూ. 37.15 కోట్లు
ఎచ్చెర్ల	87,044	రూ. 26.13 కోట్లు





గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)
శ్రీకాకుళం	98,284
ఎచ్చెర్ల	82,349



మహిళలకు ఉచిత బస్సు

నియోజకవర్గం	లబ్ధిదారులు (సుమారు)
శ్రీకాకుళం	1,92,907
ఎచ్చెర్ల	1,46,537

బాబు.. ఏదీ జవాబు?

మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు?



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని గత ఎన్నికల సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు సూపర్‌సిక్స్ హామీల్లో వాగ్దానం చేశారు. ఎక్కడికి వెళ్లినా ఉచిత బస్సు అంటూ హడావుడి చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం హామీ ఊసే లేదు. అధ్యయనాల పేరిట జాప్యం చేస్తుండటంతో డబ్బులు చెల్లించే ప్రయాణాలు కొనసాగించాల్సి వస్తోంది. ఇకనైనా విధి విధానాలు ఖరారు చేసి ఉచిత బస్సు ప్రయాణం హామీని అమలు చేయాలి.

- సత్తారు శారద, శ్రీకాకుళం

తల్లికి వందనం ఎప్పుడిస్తారు?



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం పేరిట ఎంతమంది పిల్లలుంటే అందరికీ చెరో రూ.15 వేలు చొప్పున అందజేస్తామని చెప్పారు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒకరు ఇంటర్మీడియెట్, మరొకరు 9వ తరగతి చదువుతున్నారు. వీరిద్దరికీ ఈ పథకం వర్తింపజేయాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం అందజేసే తల్లికి వందనం సాయం అందిస్తే పిల్లల ఫీజులకు, వారికి నాణ్యమైన పౌష్టికాహారానికి ఉపయోగపడుతుంది. గత ప్రభుత్వం పాఠశాలలు ప్రారంభమైన సమయంలోనే అమ్మఒడి పేరిట సాయం అందజేశారు.

- జి.హేమలత, శ్రీకాకుళం

రైతులకేదీ భరోసా?



ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల కోసం చాలా ఖర్చయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతు భరోసా సాయం కింద రూ.20 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇప్పటికి వంద రోజులు కావస్తున్నా ఇంత వరకు పెట్టుబడి సాయం ఊసే లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతుల సమస్యలు గుర్తించి త్వరితగతిన రూ.20 వేలు సాయం అందజేయాలి.

- చింతాడ శ్యామలరావు, కుర్మయ్యపేట, ఎచ్చెర్ల మండలం

నిరుద్యోగ భృతి అందేనా?



నేను బీఈడీ పూర్తిచేశాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. సూపర్ సిక్స్ పేరిట కూటమి నాయకులు నిరుద్యోగ భృతి కింద యువతకు ప్రతి నెలా రూ.3వేలు ఇస్తారని ప్రకటించారు. దీంతో నిరుద్యోగుల్లో ఎక్కువ మంది కూటమి ప్రభుత్వానికే ఓటు వేశారు. నేను నిరుద్యోగ భృతికి అర్హుడిని. నాకు నెలకు రూ.3వేలు ఇస్తారని చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే ఎదురు చూస్తున్నాను. అయినా ఇంత వరకు విధివిధానాలు ప్రకటించలేదు. తక్షణం ప్రభుత్వం స్పందించి ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి.

- పి.బుచ్చిబాబు, బైరివానిపేట, శ్రీకాకుళం రూరల్ మండలం

జగన్ చెప్పారు.. చేశారు..

పాఠశాలలు తెరిచే నాటికే అమ్మఒడి అందేది



మాకు ఇద్దరు పిల్లలు. జగనన్న పాలనలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభంలోనే పాఠశాలలు తెరిచేటప్పుడే అమ్మఒడి పథకం కింద ఖాతాలో రూ.15 వేలు జమ చేసేవారు. ఆ డబ్బులతో విద్యార్థులకు అవసరమైన సామగ్రి కొనుగోలు చేసేవాళ్లం. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరిట ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. అయినా ఇంతవరకు అమలు చేయలేదు. దీంతో పుస్తకాలు, యూనిఫాం, షూష్, సాక్సులు వంటివి కొనుగోలు చేసేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డాం. తల్లికి వందనం ఎప్పుడిస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలి.

- ఎస్.శాంతి, రామాలయం వీధి, శ్రీకాకుళం

జగనన్న పాలనలో ఠంఛన్‌గా 'భరోసా'



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు భరోసా సాయం ఠంఛన్‌గా అందేది. ఎన్ని ఇబ్బందులున్నా అనుకున్న సమయానికే మా ఖాతాల్లో డబ్బులు జమ చేసేవారు. మేము కూడా ధీమాగా వ్యవసాయం చేసుకునే వాళ్లం. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు సులభంగా అందేవి. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వ పాలన వచ్చింది. ఏటా రూ.20వేలు రైతు భరోసా సాయం ఇస్తామని ఇచ్చినా హామీ నేటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో రైతులంతా ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా రూ.20 వేల సాయానికి సంబంధించి విధి విధానాలు ప్రకటించాలి.

– ఎం.సూర్యనారాయణ, రైతు, బైరివానిపేట, శ్రీకాకుళం రూరల్ మండలం

రైతు భరోసా

నియోజకవర్గం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
శ్రీకాకుళం	22,647	రూ. 45.29 కోట్లు
ఎచ్చెర్ల	40,231	రూ. 54.31 కోట్లు



అమ్మఒడి

నియోజకవర్గం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
శ్రీకాకుళం	38,650	రూ.57.97 కోట్లు
ఎచ్చెర్ల	28521	రూ.29.25 కోట్లు





క్లుప్తంగా

గంగిరెడ్లపేటలో వైద్య శిబిరం

జి.సిగడాం: మండలంలోని జగన్నాథవలస పంచాయతీ గంగిరెడ్లపేటలో బాతువ పీహెచ్‌సీ వైద్యులు జి.అనూష, ప్రతిష్ట శర్మ ఆధ్వర్యంలో బుధవారం వైద్య సేవలు అందించారు. ఎంఎల్‌హెచ్‌పీ కింజరాపు అనూష రోగులకు రక్త పరీక్షలు చేసి మందులను అందించారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సింగుపురం గ్రామానికి చెందిన దాసరి వినయ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తలకు గాయం కావడంతో శ్రీకాకుళంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న చిక్కోలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు దాతల సహకారంతో రూ.17 వేలు సేకరించి వినయ్ కుమార్‌కు బుధవారం అందజేశారు. స్వచ్ఛంద సంస్థ సభ్యులు పొడుగు అవినాష్, బరాటం చంద్రశేఖర్, ఉర్లం శివతేజ, కలివరపు సూర్యప్రకాష్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు అమ్మవారి ఆలయాలలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ అమ్మవారికి భాద్రపద పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు బుధవారం జరిగాయి. ధర్మకర్తలు ఉషారాణి, జగన్మోహనరావు దంపతుల ఆధ్వర్యంలో 800 మందికి అన్నప్రసాద వితరణ చేశారు.

సూపర్ సిక్స్ హామీల అమలెప్పుడు?

- ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజం
- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం ఏర్పాడి వంద రోజులు పూర్తి కావస్తున్నా పేదల కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా చంద్రబాబు అమలు చేయలేదని, ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని జాడ గ్రామంలో బుధవారం మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చి సూపర్ సిక్స్ హామీలను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలన సాగుతోందన్నారు. అమరావతి ముంపునకు కారణం చంద్రబాబేనని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై ఇక పోరాటాలు చేయడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. జగనన్న ప్రభుత్వం హయంలో అర్హులందరికీ సంక్షేమం అందించామన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, మండల బూత్ కన్వీనర్ అబోతుల జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



రణస్థలం: సత్యం కుటుంబాన్ని పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గడి సత్యం ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. పాతర్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గొర్లె రమణ, ఎం.వెంకటరావు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను పారామర్శించి తన సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు మహంతి మంగయ్య, బెల్లపు అప్పలనాయుడు, రెడ్డి సూరి, గురాన చిరంజీవి సత్యనారాయణ ఉన్నారు.

చిక్కాల కుటుంబానికి..

జి.సిగడాం: మండలంలోని జాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిక్కాల నాగేశ్వరావు తమ్ముడు చందరరావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. చందరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

పెట్టుబడి సాయం అందజేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.20వేల వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని తక్షణమే రైతులకు అందజేయాలని ఏపీ రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులకు తుఫాన్ నష్టపరిహారం ఇవ్వాలని, బీమా పరిహారం అందజేయాలని, సాగునీటి ప్రాజక్టులకు ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. జీడిమామిడి పంటకు మద్దతు ధరపై జీఓ విడుదల చేయాలని, రూ.2 లక్షలలోపు రైతుల వ్యవసాయ రుణాలు రద్దు చేయాలని, వ్యవసాయ మీటర్ల జీఓ రద్దు చేయాలని, అర్హులైన కౌలు రైతులకు ప్రయోజనాలు అందజేయాలన్నారు. జిల్లాలో కొబ్బరి పార్క్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం ప్రతినిధులు చంద్రరావు, నందోడు పాల్గొన్నారు.

సచివాలయంలో చోరీపై ఆరా



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీవో వాసుదేవరావు

గార: కళింగపట్నం సచివాలయంలో తలుపు గడియ విరగ్గొట్టి దొంగలు లోపటికి వెళ్లిన ఘటనపై డీఎల్‌డీవో వాసుదేవరావు ఆరా తీశారు. బుధవారం సచివాలయానికి వెళ్లి రికార్డుల పరిస్థితిపై సెక్రటరీ కిశోర్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. పరిశీలన చేసిన వరకు అన్ని రికార్డులు ఉన్నాయని తెలిపారు. దీనిపై స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ రాము, టి.అప్పలరాజు, శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్సై కృష్ణప్రసాద్ అన్నారు. ఆర్ట్స్ కాలేజీ రోడ్డులో ఉన్న కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థుల కు బుధవారం అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని తల్లిదండ్రుల ను బాగా చూసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరం



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్సై సుధాకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: మైనర్లు డ్రైవింగ్ చేయడం నేరమని శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్సై మెట్ట సుధాకర్ అన్నారు. పట్టుబడితే మైనర్‌తోపాటు వాహన యజమానిపై కూడా చర్యలు ఉంటాయన్నారు. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేయడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమన్నార. నగరంలోని సాయికృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించి, వారిలో చైతన్యం నింపుతున్నామన్నారు. ప్రతి విద్యార్థి, యువత ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రతినిధులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

అందని వైద్య సేవలు!



శ్రీకాకుళం రూరల్: సింగుపురం పీహెచ్‌సీలో విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది

తమ పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో పని చేస్తున్న డాక్టర్లు విధులు బహిష్కరించారు. ఇన్ సర్వీస్ వైద్యులకు పీజీ విద్యలో సీట్లు కోటా తగ్గించటంతో వీరు మూడు రోజులుగా విధులకు హాజరు కాకపోవడంతో రోగులకు వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. పలు పీహెచ్‌సీలను 'సాక్షి' బుధవారం సందర్శించగా.. ఈ విషయం వెలుగు చూసింది. డాక్టర్లు సమ్మెలో ఉండగా కిందిస్థాయి సిబ్బంది విధులకు హాజరువుతున్నారు. అయితే రోగులకు వారి నుంచి సరైన వైద్య సేవలు అందడం లేదు. దీంతో రోగులు కూడా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు.

సంక్షిప్తంగా...

60 మద్యం బాటిళ్ల స్వాధీనం

ఎచ్చెర్ల: చీపురుపల్లి మండలం కరకాం గ్రామానికి చెందిన గంధ్రేటి సంతోష్ వద్ద లావేరు పోలీసులు 60 మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. లావేరు మండలం వెంకటాపురం జంక్షన్ వద్ద సంచిలో వేసుకుని పట్టుకువెళ్తున్న బాటిళ్లను స్వాధీనం చేసుకు ని సీజ్ చేశారు. రిమాండ్‌కు తరలించారు.


ఆక్రమణల తొలగింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద రెల్లవీధికి వెళ్లే దారిలో ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు బుధవారం తొలగించారు. రోడ్డుపై టిఫిన్, టీ దుకాణాలు పెట్టడంతో అటువైపుగా రాకపోకలు సాగించడం చాలా కష్టంగా ఉండేది. గుర్తించిన అధికారులు వాటిని తొలగించారు. అలాగే హడ్కోకాలనీలో ప్రధాన కూడలి వద్ద పలకలు తొలగించారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతోందని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాద్ అన్నారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన బుధవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కూడలిలో మానవహారం చేపట్టారు.

జెడ్పీ రిటైర్డు సూపరింటెండెంట్ మృతి



అరసవల్లి: జిల్లా పరిషత్ రిటైర్డ్ సూపరింటెండెంట్ కుప్పిలి ఉమామహేశ్వరరావు (84) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. 2001లో సూపరింటెండెంట్ హోదాలో ఉద్యోగ విమరణ చేసినప్పటికీ.. ఇప్పటికీ జిల్లా పరిషత్‌లో పరిపాలన వ్యవహారాల ఫైళ్లలో తప్పొప్పులు దిద్దుతూ.. ఈ తరం పంచాయతీరాజ్ ఉద్యోగులకు మంచి మార్గదర్శిగా గుర్తింపు పొందారు. ఉమామహేశ్వరరావు మృతిపై జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, సీఈవో ఆర్.వెంకట్రామన్, రాష్ట్ర, జిల్లా శిష్టకరణ సంఘ అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, డబ్బీరు శ్రీనివాసరావు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.